



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

యాత్రికుల భద్రతే లక్ష్యం

- సేవా భావంపై దృష్టి సారిస్తాం - ఎస్పీ సిద్ధార్థ కౌశల్
- వర్చువల్ ద్వారా 'టూరిస్టు పోలీసు స్టేషన్' ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చే యాత్రికుల భద్రతే లక్ష్యంగా సేవా భావంపై దృష్టి సారిస్తామని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తెలిపారు. మంగళవారం శ్రీరాఘవేంద్రస్వామి మఠం ప్రాంగణం మధ్వ కారిడార్‌లో ప్రత్యేక భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎపి టూరిస్టు పోలీసు స్టేషన్'ను తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా (వర్చువల్ విధానం) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 21 పర్యాటక ప్రాంతాల్లో టూరిస్టు పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాలోని మంత్రాలయం శ్రీమఠం ఆవరణలోని టూరిస్టు పోలీసు స్టేషన్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ టూరిస్టు పోలీసు స్టేషన్ ఒక ఎస్ఐ ఆధ్వర్యంలో ఏడుగురు పోలీసులు రోటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. భద్రత పరంగా సేవలు అందిస్తారన్నారు. ఏదైనా ఆపద, ప్రమాదం జరిగిన సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తా రని చెప్పారు. భద్రతే ప్రధానంగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా చూస్తామని వివరించారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం సామాన్య భక్తులే కాకుండా ప్రజాప్రతినిధులు, విఐపిలు అత్యధిక సంఖ్యలో వస్తుండడంలో అత్యధిక భద్రత కల్పించి పోలీసు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పర్యాటకులకు ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించేలా ఇకపై ఈ టూరిస్ట్ పోలీసింగ్ విధానం సమర్థవంతంగా అమలు కానుందని తెలిపారు. సమాచారాన్ని బ్రోచర్ల రూపంలో అందుబాటులో ఉంచామని చెప్పారు.

భక్తుల యోగక్షేమాలే ధ్యేయం
- పోలీసు శాఖకు అండగా ఉంటాం
- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుధేంద్ర తీర్థులు

భక్తుల యోగక్షేమాలే ధ్యేయంగా శ్రీమఠం సౌకర్యాలు కల్పిస్తోందని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తెలిపారు. 'టూరిస్ట్ పోలీసు స్టేషన్'ను ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌తో కలిసి పీఠాధిపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసు శాఖకు అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. పోలీసు స్టేషన్‌కు కావాల్సిన గదులు, ఫర్నీచర్ ఇతర ఇతర సామగ్రి శ్రీమఠం సమకూరుస్తుందని చెప్పారు. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక కేంద్రాల్లో మంత్రాలయ ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. సెలవు రోజుల్లో, ప్రత్యేక పర్వదినాల్లో రోజుకు లక్ష మంది దాకా భక్తులు వస్తుంటారని చెప్పారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్నందున ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అవుటర్ రింగు రోడ్డు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ఎంటిఆర్ సర్కిల్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రధాన ఆర్చి పక్కన పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేసి అప్పగిస్తామని చెప్పారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్, ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్, మంత్రాలయం సిఐ శ్రీనివాసులు, కమ్యూనికేషన్ సిఐ మనోహర్, మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్ రాజు, మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు, శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రయా(స)ణం

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- ఏళ్లు గడిచినా పట్టించుకోని పాలకులు



ఇది ఎమ్మిగనూరు నుంచి పత్తికొండకు వెళ్లే రహదారి. కందనాతి, కడివెళ్ల, బిల్లేకల్ గ్రామాల మీదుగా ఈ రోడ్డు వెళ్తుంది. ఈ రోడ్డు పొడవు దాదాపు 47 కిలోమీటర్లు. నిత్యం వందలాది సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తుంటాయి. దారి పొడవునా ఎక్కడ చూసినా రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది కోసిగి నుంచి అర్లబండకు వెళ్లే రహదారి. దుద్ది, తిప్పలదొడ్డి మీదుగా వెళ్లేందుకు 16 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. ఆ కొంత దూరంలోనే దాదాపు 50 చోట్ల గుంతలు పడ్డాయి. దీంతో ఆ దారిలో ప్రయాణించే వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో పాటు వాహనాలు కొన్ని రోజులకే మరమ్మతులకు గురవుతున్నాయి.



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. సంక్షేమం పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తున్న పాలకులు అభివృద్ధి పనులవైపు కన్నెత్తి చూడకపోవడంతో ఏళ్ల కాలంగా గ్రామీణ రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో అవే దారుల్లో ఎమ్మెల్యేలు వెళ్తున్నా రోడ్ల రూపురేఖలు మార్చేందుకు చర్యలు చేపట్టడం లేదు. చాలా ప్రాంతాల్లో రోడ్లు గుంతలు, మట్టితో దర్శనమిస్తున్నాయి. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎమ్మిగనూరు నుంచి మంత్రాలయం మండలం మాలపల్లికి వెళ్లే రోడ్లులో జాలవాడి వరకూ దాదాపు 10 కిలోమీటర్ల మేర తారు రోడ్డు మొత్తం వెళ్లిపోయి మట్టి మాత్రమే మిగిలింది. దానికి తోడు చాలా చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కోసిగి నుంచి పల్లెపాడు, చింత కుంట మీదుగా వెళ్లేందుకు 10 కిలోమీటర్ల మేర మాలపల్లి వరకు ఉన్న రోడ్డు పూర్తి గుంతల మయంగా మారింది. సి.బెళగల్ మండలంలోనీ చింతమానుపల్లె-తిమ్మందొడ్డి మధ్య దారి అధ్వాన్నంగా మారింది. బెళగల్ నుండి చింతమానుపల్లె మీదుగా తిమ్మందొడ్డి వరకు పది కిలోమీటర్లు ఉంది. చింతమానుపల్లె వరకు ఏడు కిలోమీటర్లపైగా బిటి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నా ఎలాగో ప్రయాణ అవసరాలు తీర్చుకొంటున్నారు. అదే చింతమానుపల్లె నుండి తిమ్మందొడ్డి వరకు కేవలం రెండు కిలోమీటర్లు పైన ఉంది. అది కూడా ఏళ్లుగా మట్టి రోడ్డు కాగా బీటి రోడ్డుకు నోచుకోలేదు. ప్రస్తుతం ఈ రోడ్డులో వెళ్లాలంటే నరకయాతన పడాల్సిందే. గతంలో కర్నూలు నుండి చింతమాను పల్లెకు ప్రత్యేకంగా బస్సు వచ్చేది. బస్సు రాక ఐదేళ్లు అవుతోంది. బైకులు ఆటోలు వెళ్ళడానికి వీలు లేదు. కనీసం నడిచి వెళ్ళడానికి వీలు కూడా లేకుండా పోయింది. గత్యంతరం లేక తీవ్ర అవస్థల నడుమ ప్రయాణ అవసరాలు తీర్చుకోక తప్పడం లేదు. గూడూరు మండల కేంద్రం నుంచి కోడుమూరు వెళ్లే కంకర రోడ్డు గుంతల మయంగా మారింది. వర్షాకాలంలో నీరు చేసి కుంటల మయంగా మారుతోంది. ఆదోని మండలంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. పెద్దహరివాణం నుంచి సంతేకుడ్లూరు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. నాగలాపురం ఆర్చి నుంచి నాగలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలు, బురదమయంగా తయారైంది. దొడ్డనగేరి నుంచి జాలమంచికి వెళ్లే దారి ఏళ్ల కాలంగా మట్టి రోడ్డుకే పరిమితం అయింది. పత్తికొండ మండలంలోనూ రోడ్లు అదే దుస్థితిలో ఉన్నాయి. పత్తికొండ మండలకేంద్రంలో అంబేద్కర్ సర్కిల్, గుత్తి సర్కిల్ ప్రాంతాల్లో రోడ్డు గుంతలుపడ్డాయి. వర్షాకాలంలో వర్షపు నీరు నిలుస్తున్నాయి. పత్తికొండ నుంచి గుంతకల్ వెళ్లే దారిలో హోసూరు వద్ద గుంతలమయమైంది. హోసూరు నుంచి పెద్దహుల్తి రోడ్డు ఏళ్ల కాలంగా మట్టితేలి దర్శనమిస్తోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్లను బాగు చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విఆర్‌ఎలకు ఫేస్ యాప్ మినహాయించాలి

- కలెక్టరేట్ ఎదుట విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విఆర్‌ఎలకు ఫేస్‌యాప్ విధానాన్ని తీసుకొచ్చిందని ఫేస్‌యాప్ విధానం నుండి విఆర్‌ఎలకు మినహాయింపు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫేస్‌యాప్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట విఆర్‌ఎలు ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ప్రహ్లాద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామ సేవకులు గ్రామీణ ప్రాంతాల్లో వేళాపాల లేకుండా ఏ చిన్న అధికారి చెప్పిన పని అయినా చేస్తూ ఉంటారని ఏ టైంలో ఎక్కడ ఉంటారో వారికే తెలియదని, అటువంటి వారికి ఫేస్ యాప్ విధానాన్ని తీసుకొని రావడం సరైంది కాదన్నారు. గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లుగా పిలవబడుతున్న గ్రామ సేవకులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, అనేక సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం గవర్నమెంట్ ఉద్యోగులకు అమలు చేసినట్లు ఫేస్‌యాప్ విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. చాలామంది గ్రామ సేవకులలో నిరక్షరాస్యులు ఉన్నారని, వారికి ఫేస్ యాప్ ఎలా ఉపయోగించాలో తెలియదని అన్నారు. తెలిసినా ఒక్కొక్కరు రూ.20000 రూ.30,000 పెట్టి ఫోన్లు కొనుక్కునే స్థోమత గ్రామ సేవకులలో లేదని అన్నారు. ఒకవేళ కొనుక్కున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ ప్రాబ్లమ్ ఉంటుందని అన్నారు. ఉపయోగించకపోతే వాళ్లు ఆరోజు డ్యూటీలో లేనట్లుగా భావిస్తారనిఅన్నారు. ఏ రకంగా చూసిన గ్రామ సేవకులకు ఫేస్‌యాఫ్ అనే విధానాన్ని అమలు చేయడం సాధ్యం కాదని సాధ్యాసాధ్యాలు పరిశీలించి విధానాల అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గుడ్డిగా అందరికీ ఒకే విధానమన్నట్లు వ్యవహరిస్తుందని అన్నారు. కరోనాకాలంలో గ్రామ సేవకులకు ఇచ్చిన డిఎను రికవరీ చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. గ్రామ సేవకులకు ఇచ్చిన డిఎ రూ.300 , రూ.200 కూడా వసూలు చేస్తుందంటే ప్రభుత్వ పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. గ్రామ సేవకులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేస్‌యాప్‌ను వెనక్కు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామ సేవకుల సంఘం నాయకులు రాజు, అశోక్, గోపాల్ ధనుంజయ పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

సంజీవయ్య సమాజానికి ఆదర్శం

- పదవంటే సంపాదన కాదు బాధ్యత
- సంజీవయ్య జయంతి సభలో ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజకీయ పదవంటే సంపాదన కాదని బాధ్యత అని నిరూపించిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం నేటి సమాజానికి ఆదర్శం కావాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు అన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటి ఆధ్వర్యంలో మంగళవారం దామోదరం సంజీవయ్య 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. నంద్యాల చెక్ పోస్ట్ వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కాటి కాపరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి కృష్ణ అధ్యక్షతన జరిగిన జయంతి సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు మాట్లాడారు. నీతివంతమైన సమాజం నిర్మాణం చేయాలంటే. అందుకు అంతే నిజాయితీ గల దామోదరం సంజీవయ్య లాంటి నాయకులు మనకు ఆదర్శమన్నారు. సంజీవయ్య స్ఫూర్తితో పదవంటే సంపాదన కాదు, బాధ్యత అనుకునే వాళ్లను ఈ సమాజంలో మనం ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలని ఆనంద్‌బాబు సూచించారు. 38 సంవత్సరాల వయసులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి దళిత ముఖ్యమంత్రిగా దేశవ్యాప్తంగా కీర్తి గడించారన్నారు. నీతి, నిజాయితీ, సేవ అనే లక్ష్యాలతో మచ్చలేని నాయకుడిగా సమాజం ముందు ఆదర్శంగా నిలిచారన్నారు. సర్పంచి, ఎంపిటిసి, కౌన్సిలర్, ఎమ్మెల్యే లాంటి పదవులు వస్తేనే కోట్లు కూడగట్టుకుంటున్న నేటి పాలకులను ఎన్నుకుంటున్నామన్నారు. సంజీవయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై గళమెత్తి, వెనకబడ్డ ప్రాంతాల సమస్యలను వెలిగెత్తి చాటే, పోట్లాడే పోతుల నాగరాజును పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. ఆ రకమైన అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం కెవిపిఎస్‌కృషి చేస్తుందని, అదే సంజీవయ్యకు ఇచ్చే గొప్ప నివాళి అన్నారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్.పెద్దబాబు, ఆంధ్రా గురుస్వామి, దళిత సీనియర్ నాయకులు ఎల్‌ఐసి లక్ష్మయ్య, కెవిపిఎస్ జిల్లా నాయకులు టి.లక్ష్మీనారాయణ, యేసు, రాజు, చిన్న రోశయ్య, జె.సామేలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

ఎపిఎస్‌సి, ఎస్‌టి లాయర్స్ నాయకుల ఆధ్వర్యంలో...

ఎపి ఎస్‌సి, ఎస్‌టి లాయర్స్ ఫోరమ్ నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి , భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదరం సంజీవయ్య 102వ జయంతిని సందర్భంగా కర్నూలులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ల అర్పించారు.కర్నూలు అండ్ ఎపి హైకోర్టు అధ్యక్షుడు ఎపి, ఎస్‌సి, ఎస్‌టి లాయర్స్ ఫోరం కర్నూలు, ఎపి హైకోర్టు అధ్యక్షులు వై. జయరాజ్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఆయన నిజాయితీ , చిత్తశుద్ధిని , జాతికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఫోరం నాయకులు ఎ.మాదన్న, ఎం.సుబ్బయ్య, రవిరాజు, బి.చిన్నయ్య, నాగప్ప, పుల్లన్న, నాగముని, దస్తగిరి, దళిత నాయకులు జి.నాగరాజు, డిఇఇ ప్రేంకుమార్, వి.శ్రీనివాసులు, నరసింహులు, మాధవస్వామిలు పాల్గొన్నారు.

నీతి,నిజాయితీకి నిలువుటద్దం సంజీవయ్య : నీతి నిజాయితీకి నిలువుటద్దం దామోదరం సంజీవయ్య అని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతోత్సవాన్ని పురస్కరించుకొని కార్పొరేషన్ లోని కౌన్సిల్ హాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కమిషనర్‌తో పాటు డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, మేనేజర్ చిన్నరాముడు, రెవిన్యూ ఆఫీసర్ జునైద్ తదితరులు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రజలకు మెరుగైన సేవలంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సచివాలయాల పరిధిలో పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కర్నూలు నగరంలోని జోహరపురంలో ఉన్న 40, 41వ వార్డు సచివాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ పరిధిలో పరిశుభ్రంగా ఉంచుకోవడం సిబ్బంది బాధ్యత అని తెలిపారు.

ట్రిపుల్ ఐటి డిఎం మౌలిక సదుపాయాలు : జగన్నాథగట్టులోని ట్రిపుల్ ఐటి డిఎం భవన సముదాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరగా కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జగన్నాథగట్టులోని ట్రిపుల్ ఐటి డిఎం మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రిపుల్ ఐటి డిఎంకు సంబంధించిన అవసరమైన మౌలిక సదుపాయాల్లో భాగంగా ఎన్‌హెచ్ 40 నుంచి యూనివర్సిటీ వరకు అవసరమైన రహదారి నిర్మాణానికి టెండర్స్ పిలిచినట్లు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ ఎస్ఇ కలెక్టర్‌కు వివరించారు. యూనివర్సిటీ కోసం అవసరమైన 2 ఎల్‌ఎమ్‌డి ట్యాంకు తాగు నీటి సదుపాయం కోసం ప్రతిపాదనలు తయారు చేసినట్లు కలెక్టర్‌కు తెలిపారు. విద్యుత్‌కు సంబంధించి హెచ్‌టి లైన్లు మార్చే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు విస్తరణ, వీధి దీపాలు, కళాశాల ప్రహరీ నిర్మాణానికి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సంబంధిత అధికారులు రూపొందించిన ప్రణాళికను నివేదిక రూపంలో అందజేయాలని తెలిపారు. జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ పాల్గొన్నారు.

సంజీవయ్యను ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

దామోదరం సంజీవయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని నడుచుకుందామని కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం దామోదరం సంజీవయ్య 102వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఆయన చిత్రపటానికి కలెక్టర్ పి.కోటేశ్వర రావు, జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిఆర్ఓ నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ డిడి ప్రతాప్, సూర్యనారాయణ రెడ్డి, ఎఒ వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్త, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్.బజారన్న, డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ అమరేందర్ రెడ్డి, సిటీ మైనారిటీ సెల్ ఛైర్మన్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు. **కర్నూలు (కార్పొరేషన్)** జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, గ్రంథాలయ అధికారులు వజ్రాల గోవింద రెడ్డి, ఈశ్వరమ్మ, ఎస్.బాషా, ఉమా, నాగ భాస్కర్, మక్బుల్ బాషా, సుదర్శనం, సువర్ణమ్మ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్

సి బెళగల్ : దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని మహోన్నతుడని ఎంపిడిఒ రాముడు కొనియాడారు. పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖధికారుల మధ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. 38 ఏళ్లకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశ రాజకీయంలో కీలక నాయకులుగా రాణించారని, ఆయన స్ఫూర్తితో మనమంతా ముందుకెళ్లాలన్నారు.

కర్నూలు క్రైమ్ : కర్నూలు జిల్లాకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య పేరును నామకరణం చేయాలని నల్లారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కేదార్‌నాథ్ అన్నారు. కర్నూలు, నంద్యాల రోడ్డు చెక్‌పోస్ట్ మూడు రోడ్ల కూడలి సమీపంలోని దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నల్లారెడ్డి ఫౌండేషన్ సభ్యులు వసంత్, జశ్వంత్, ఆదిశేషు, మధు తదితరులు పాల్గొన్నారు.



సూర్యనారాయణకు జలాభిషేకం

ప్రజాశక్తి - కర్నూలు

కర్నూలు నగరంలోని సూర్యనారాయణ స్వామివారి మూలవిరాట్‌కు పురుష సూక్త విధానంతో అరుణ పారాయణ పూర్వకంగా జలాభిషేకం నిర్వహించినట్లు ఆలయ ఛైర్మన్ టిఎస్.రామకృష్ణ తెలిపారు. మంగళవారం జలాభిషేకం నిర్వహిస్తున్న సమయంలో ప్రత్యక్ష సూర్య కిరణాలు స్వామివారి మూలవిరాట్‌ను స్పృశించినట్లు ఆయన తెలిపారు. ఈ అద్భుతాన్ని చూసి భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారని చెప్పారు. అనంతరం స్వామివారికి అర్చన మంత్రపుష్పం వేద స్వస్తి నిర్వహించినట్లు తెలిపారు.

గుండ్రేవుల కలను సాకారం చేయాలి

- గుండ్రేవులను సందర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - సిబెళగల్



పరిశీలిస్తున్న నాయకులు

సి బెళగల్ మండలం గుండ్రేవుల వద్ద నదికి అడ్డంగా రిజర్వాయర్ నిర్మించి రైతులకు సాగు, ప్రజలకు తాగు నీటి కలను సాకారం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ రాష్ట్ర జిల్లా, ప్రాంతీయ బృందంతో సందర్శించారు. ఈ సందర్భంగా 2005లో కర్నూలు, అనంతపురం జిల్లాలకు గుండ్రేవులనే శరణ్యమంటూ రిజర్వాయర్ నిర్మాణ ప్రస్తావనకు వచ్చిందని అందులోనే 2009లో కాంగ్రెస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి ఆ తర్వాత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు లు సర్వేలు చేసి 20 టిఎంసిలకు రూ.3250 కోట్లుగా అంచనా వేశారని అన్నారు. 2011 లో శంకుస్థాపన చేయాల్సిన ప్రభుత్వం ఇప్పటివరకు వైసిపి ప్రభుత్వంలో కూడా మీనమేషాలు లెక్కిస్తున్నదని అన్నారు. ఇక్కడి ప్రాంత వాసుల అభివృద్ధి పట్టని ప్రభుత్వాలు ఎందుకని విమర్శించారు. జిల్లాలో హంద్రీ నీవా, హగరి, పులకుర్తి వంటి ప్రాజెక్టులు పూర్తి చేయనందున పశ్చిమ ప్రాంతం వలసబతుకులు తప్పడం లేదన్నారు. ప్రభుత్వం ఇక్కడి ప్రజలకు సాగుకు, తాగుకు సాకారం చేసి బతుకులు మెరుగు పడేలా రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, హరినాథ్‌రెడ్డి, అజయ్ కుమార్, రామచంద్రయ్య, జగదీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజినేయులు, ఆవుల శేఖర్, నక్కి లెనిన్‌బాబు, రంగనాయుడు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోతుల నాగరాజును గెలిపించాలి : సిఐటియు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని బుధవారపేట 15వ వార్డులో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ ప్రచార కార్యక్రమానికి సిఐటియు ఓల్డ్ సిటీ నగర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్, సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి అయిన పోతుల నాగరాజు కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత 32 సంవత్సరాలుగా అనేక ప్రజా ఉద్యమాలలో భాగస్వామి అయి ఉపాధ్యాయ వత్తిని వదులుకొని ఉద్యోగ ఉపాధ్యాయ రిటైర్డ్ ఉద్యోగుల నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తి పోతుల నాగరాజు అని గుర్తు చేశారు. బుధవారపేట ప్రచారంలో ఉద్యోగులు, నిరుద్యోగులు రిటైర్ అయిన వారు పోతుల నాగరాజుకు ఓటు వేస్తామని చెప్పారన్నారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, సిఐటియు కమిటీ సభ్యులు జి.రమేష్ బాబు, మహిళా సంఘం నగర ప్రధాన కార్యదర్శి బి.పద్మావతి, సిఐటియు బి. లక్ష్మన్న పాల్గొన్నారు.

24వ వార్డులో ప్రచారం: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు ఇ.ఎల్లగువేర, వి.వెంకటేశ్వర్లు, సి.శేషాద్రి,సి. శ్రీనివాసులు కర్నూలు నగరం లోని 24 వ వార్డులో ప్రచారం చేశారు. రామకృష్ణ స్కూల్, కాకతీయ స్కూల్ ఉపాధ్యాయులను కలసి కర్నూలు, కడప, అనంతపురం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు మొదటి ప్రాధన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు.

కర్నూలు హాస్పిటల్ : పశ్చిమ రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని ఓర్వకల్లు మండలంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. నన్నూరు సచివాలయం ఇతర కార్యాలయాల్లో కరపత్రాల పంపిణీ, పోస్టర్ల విడుదల కార్యక్రమం చేపట్టారు. ఎపి రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి ఎస్.మధుసూదన్ మాట్లాడుతూ శాసన మండలిలో ప్రజల, ఉద్యోగుల, కార్మికుల, రైతుల పక్షాన నిలబడి నిరంతరం పోరాడుతున్న పిడిఎఫ్ బలపరిచిన పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించాలని పట్టభద్రులను కోరారు. ప్రజా సమస్యల పై నిలబడి ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పోరాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ప్రజా సంఘాలుగా మా మద్దతు ఉంటుందని అన్నారు. నాయకులు మాసుం బాష బషీర్, దస్తగిరి, సంజీవ, రోశన్న పాల్గొన్నారు.



కర్నూలులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

'జగనాసుర రక్త చరిత్ర' పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ఆదేశాల మేరకు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇంచార్జి గౌరు చరితరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మాధవినగర్ గౌరు దంపతుల స్వగహం నందు జగనాసుర రక్త చరిత్ర పోస్టర్‌ను గౌరుచరితరెడ్డి, గౌరు వెంకటరెడ్డి, టిడిపి నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం గౌరు చరిలతారెడ్డి మాట్లాడుతూ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోని నిజానిజాలు రాష్ట్ర ప్రజలకు తెలుస్తాయని అన్నారు. ఈ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, ఈ పుస్తకంలో సాక్ష్యాలను ఎలా చెరిపివేశారు. హత్య వెనుక ఎవరున్నారు వంటి వివరాలు ఉన్నాయని అన్నారు. జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి కావడానికె కోడి కత్తి, చివరకు బాబాయిని హత్య చేసి మచ్చలేని మాజీ సిఎం చంద్రబాబు నాయుడుపై ఆరోపణలు చేశారన్నారు. నిజాలు నిదానంగా ప్రజలకు తెలుస్తాయని వారు చెప్పారు. మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎస్‌వి.రామకష్ణ, నియోజకర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు నాగ శేషులు, పాణ్యం మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఉయ్యాలవాడ నాగేశ్వర రెడ్డి, దొడ్డిపాడు బాషా,రవి ప్రకాష్ రెడ్డి, రవీందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : పీడీ

ప్రజాశక్తి - తుగ్గలి

పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని కెపి.గుడిసెలు గ్రామంలో శివజ్యోతి గ్రామ సంఘంలో సభ్యులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీవనోపాధి పెంపు కోసం, ఆదాయ అభివృద్ధి కోసం, బుక్స్ ఆఫ్ రికార్డ్స్ గ్రూపు ద్వారా మంజూరైన రుణాలను ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొదుపు మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వాటి ద్వారా ఆర్థికంగా బలపడాలని కోరారు. ఎపిఎం రాధాకృష్ణ, సిసి శేఖర్, రవికుమార్, ఆచారి, హెచ్‌డిసిసి ఆంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య



ఎంపిడిఒ సుధాకర్ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - చిప్పగిరి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల జీతాలను చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కార్యాలయంలో ఎంపిడిఒ సుధాకర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు 11 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వారికి వెంటనే ప్రభుత్వం బకాయిలను చెల్లించాలని కోరారు. పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు, పనిముట్లు, రిక్షా మరమ్మతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనం రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. అలాగే కార్మికుల ఖాతాలకే నేరుగా జీతాలు వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే పారిశుధ్య పనులు నిలిపేసి నిరసనకు దిగుతామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులు రామాంజనేయులు, గోవిందరాజులు, రవి, నాగన్న, రాముడు, గోవిందు, ధనుంజయ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

గుండెపోటు చిత్రీకరణ మీకే సాధ్యం

- టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి

ప్రజాశక్తి - ఆదోని



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్ చౌదరి

వైఎస్.వివేకానంద రెడ్డి హత్యను గుండె పోటుగా చిత్రీకరించారని, అది వైసిపి నాయకులకే సాధ్యమని టిడిపి జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి ఎద్దేవా చేశారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో వైఎస్.వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించిన 'జగనాసుర రక్త చరిత్ర' గోడపత్రికను భూపాల్ చౌదరి, టిడిపి నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివేకాది హత్య అని, 'నారాసుర రక్త చరిత్ర' అని సాక్షి పత్రికలో తాటికాయంత అక్షరాలతో ప్రముఖంగా ప్రచురించారని తెలిపారు. నేరాలు, భారీగా కుంభకోణాలు చేసి వాటిని ఎదుటి వారికి అంటగట్టడం జగన్ రెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు. వెంకటేష్, బసవరాజు, మహ్మద్, అయ్యన్న, రామాంజి, ఐసి.రామకృష్ణ, మల్లికార్జున, ప్రతాప్ రెడ్డి, నాగరాజు, సోము, రవి, జగదీష్, వీరేష్, నాగప్ప, విజయ్ పాల్గొన్నారు.

అధిక ఎరువులతో పెట్టుబడి ఖర్చు

- ఎడిఎ సునీత

ప్రజాశక్తి - హాలహర్వి

విచక్షణారహితంగా ఎరువులు వేయడం వల్ల పంటల దిగుబడి తగ్గి, ఖర్చు పెరుగుతుందని ఎడిఎ సునీత తెలిపారు. మంగళవారం మండలంలోని బాపురం గ్రామంలో 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు విచక్షణ రహితంగా ఎరువులు పంటలకు వేస్తున్నారని, దీనివలన ఖర్చు పెరగడమే కాకుండా పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. భూసార పరీక్షల ద్వారా ఎరువులు వాడాలని, దీని వల్ల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. అలాగే తూర్పు, పడమరకు కాలిబాటలు తీయాలని, దీనివల్ల గాలి బాగా తగిలి పంట బాగా పండుతుందని తెలిపారు. చీడపీడల బాధ తగ్గుతుందన్నారు.

సైక్లింగ్ ఫర్ హెల్త్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



సైకిల్ తొక్కుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మండలంలోని ఇస్వి ప్రాథమిక పాఠశాలలో 'ఆయుష్మాన్ భారత్ సైక్లింగ్ ఫర్ హెల్త్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సూర్య నాయక్, ఎఎన్ఎం విజయలక్ష్మి మాట్లాడారు. సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు గాదిలింగప్ప, మల్లికార్జున, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఉపేంద్ర, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను గెలిపించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - హొళగుంద



హొళగుందలో ప్రచారం నిర్వహిస్తున్న రాధాకృష్ణ

ప్రశ్నించే గొంతుకలను గెలిపించి, శాసన మండలికి పంపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజుకు, కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా మంగళవారం హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చిలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో నిరంతరం ప్రజా సమస్యలపై గళం విప్పే నాయకులను ఎన్నుకోవాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల కోసం, రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కోసం, రాయలసీమ జిల్లాల్లో నూతన పరిశ్రమల సాధన కోసం పోరాడే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు వెంకటేష్, నాగరాజు, రవికుమార్ పాల్గొన్నారు.



ఆదోనిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఆదోని : నిరుద్యోగ, ప్రజా సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించే వారినే ఎన్నుకుందామని సిఐటియు నాయకులు గోపాల్, లక్ష్మన్న, తిప్పన్న, నాగరాజు కోరారు. మంగళవారం పశ్చిమ రాయలసీమ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టణంలోని పోస్టల్, టెలికాం, గ్రంథాలయ కార్యాలయాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరంతరం ప్రజల సమస్యల మీద పని చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. యుటిఎఫ్, ఎస్‌టియు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, సిఐటియు, ఎఐటియుసి, బీసీ సంఘాలు, రిజర్వేషన్ల పోరాట సమితి బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కోసిగి రూరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ సమస్యలపై ప్రశ్నించే గొంతుకకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకొని శాసన మండలికి పంపాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల నాయకులు వీరేష్, నీలకంఠప్ప, పూజారి శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు కోరారు. మంగళవారం కోసిగిలోని సచివాలయం, పంచాయతీ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



కోసిగిలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అన్నదాన నిర్వహణకు రూ.2 లక్షల విరాళం

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి భక్తుల నుంచి రూ.2 లక్షల విరాళం ఇచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన పరిమళ, పి.రావు రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు మంత్రాలయం వచ్చారు. దర్శన అనంతరం శ్రీమఠం నిర్వహణలో ఉన్న అన్నపూర్ణ భోజనశాలలో జరుగుతున్న నిత్య ప్రసాద వితరణకు రూ.2 లక్షల విరాళం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి శేషవస్త్రం అందజేసి ఆశీర్వదించారు.

ఘనంగా 'సియోను' వార్షికోత్సవం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి సియోను ప్రార్థన మందిరం మూడో వార్షికోత్సవాన్ని పాస్టర్లు రాజు, జయమ్మల ఆధ్వర్యంలో మంగళవారం సంఘం పెద్దల అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి ముఖ్య ప్రసంగికులుగా 22 పాస్టర్ సంగీతారావు హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లను మందిరం సేవకులు రాజు, జయమ్మల ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సన్మానించి మెమోంటు అందజేశారు. పాస్టర్లు కుమార్, జాన్ జోసెఫ్, ప్రసన్న, సంఘం పెద్దలు స్వామిదాసు, జోసెఫ్, విజయ్ కుమార్, సంపత్ కుమార్, ఇశ్రాయేలు, ఏసేపు, సులేమాన్, నెహెమ్యా పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న శ్రీనివాసులు, నాయకులు

వైభవంగా వన్నూరు వలీ ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కరివేముల గ్రామంలో వన్నూరు వలీ స్వామి ఉరుసు ఉత్సవాలు మంగళవారం వైభవంగా సాగాయి. రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వైసిపి నాయకులు ఎల్‌కె.శ్రీనివాసులు, వీరేష్ ఆయనకు పూలమాల వేసి, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల నాయకులు దివాకర్ నాయుడు, నారాయణరెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, రామచంద్ర, జయరాం పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ షాహీనా పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని ఎపి మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహిన పర్వీన్, సిబ్బంది చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, మండల అధ్యక్షులు ఖాజా మాట్లాడారు. క్విజ్ పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీయడంతో పాటు వారి మేధస్సుకు పదును పెట్టినట్లు అవుతుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ అంటే కేవలం పోరాటాలు మాత్రమే కాదని, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా చేపడతామని చెప్పారు. సహాయ కార్యదర్శి సలీం, నంది కుమార్, కళాశాల సిబ్బంది సమీర్, పద్మావతి, శశికళ, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - హొళగుంద

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, సదుపాయాలను మంగళవారం తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఆర్ఐ దినోజు కుమార్, విఆర్ఒ విజయలక్ష్మి, మండల సర్వేయర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 527 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో మహిళ ఓటర్లు 72 మంది, పురుష ఓటర్లు 455 ఉన్నారని చెప్పారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం ఆరుగురు ఉన్నారని, ఇందులో పురుషులు ఐదుగురు, స్త్రీ ఓటరు ఒకరు ఉన్నారని వివరించారు.

పాలకుల మెడలు వంచి ఎస్టీ రిజర్వేషన్ సాధన

- ఐక్యమత్యంతోనే వాల్మీకుల సమస్యలు పరిష్కారం - ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ చేసే వరకు పోరాటం

- మాజీ మంత్రి కాలువ... బిజెపి నాయకులు డాక్టర్ పార్థ సారథి - విజయవంతంగా వాల్మీకుల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాజకీయాలకు అతీతంగా పాలకుల మెడలు వంచి ఎస్టీ రిజర్వేషన్ సాధనకు ఉద్యమించాలని వక్తలు కోరారు. ఐక్యమత్యంతోనే వాల్మీకుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం ప్రతి వాల్మీకి రాజకీయాలకు అతీతంగా పోరాటాలు చేయాలని తెలిపారు. మంగళవారం స్థానిక అజంతా ఫంక్షన్ హాలులో కర్నూలు జిల్లా స్థాయి వాల్మీకుల రౌండ్ టేబుల్ సమావేశం పార్థ డెంటల్ అధినేత డాక్టర్ పార్థసారథి అధ్వర్యంలో విజయవంతంగా సాగింది. దాదాపు 2 వేల మంది వాల్మీకులు హాజరయ్యారు. ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం అనుసరించాల్సిన విధానంపై అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాల్మీకుల పెద్దలు, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి, పార్థ డెంటల్ అధినేత డాక్టర్ పార్థ సారథి, టిడిపి హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబిక లక్ష్మినారాయణ, తెలంగాణ సివిల్ సప్లయిస్ ఛైర్మన్ గట్టు తిమ్మప్ప, వాల్మీకి ఎస్టీ సాధన ఉద్యమ నేత పెనుగొండ ఈశ్వరయ్య మాట్లాడారు. రాజకీయాలతో కొందరికి మేలు జరగవచ్చుని, రిజర్వేషన్ వస్తే వాల్మీకి సమాజం లాభ పడుతుందని తెలిపారు. ఇందు కోసం యువత ముందుకు రావాలని కోరారు. ఈ ఏడాదిలో సమస్య పరిష్కారం కాకపోతే మరో ఐదేళ్ల ఎవరూ పట్టించుకోరని చెప్పారు. రాయలసీమ జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉన్న వాల్మీకుల ఓట్లు రాజకీయ పార్టీలకు కావాలని, కానీ సమస్యలు మాత్రం పట్టవని తెలిపారు. అడిగితే భిక్షమని, పోరాడితే వచ్చేది హక్కు అని చెప్పారు. దశలవారీగా పోరాటాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఎస్టీ రిజర్వేషన్ సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. భవిషత్తు తరాల వారి కోసం బాటలు వేయాలని తెలిపారు. వాల్మీకి పెద్దలు పొగాకు రామచంద్ర, గుడిసె కృష్ణమ్మ, కౌతాళం ఉలిగయ్య, మాధవరం రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణా రెడ్డి, తిక్కన్న, కొండయ్య, బిఆర్‌కె.రామకృష్ణ, బజారి, రంగస్వామి, కోటేకల్ లక్ష్మన్న, జగ్గాపురం చిన్న ఈరన్న, దయాసాగర్, రామకృష్ణ నాయుడు, కాశీం నాయుడు, క్రాంతి నాయుడు, జక్కుల శ్రీనివాసులు, వినోద్ కుమార్, జెఎన్.జగదీష్, యాపిలయ్య, మధుబాబు నాయుడు, రాజ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి



మాట్లాడుతున్న కాల్వ శ్రీనివాసులు

న్యాయం చేయాలని బాధితుల విన్నపం

ప్రజాశక్తి - ఆదోని

దాడికి పాల్పడిన పొరుగింటి వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని హవన్నపేటకు చెందిన బాధిత దంపతులు సతీష్ ఆచారి, దివ్యవాణి పోలీసులను మంగళవారం కోరారు. బాధితుల వివరాల మేరకు... ఇటీవలే హవన్నపేటలో ఓ ఇల్లు కొని కాపురముంటున్నామని, పక్కనే ఉన్న కపటి చంటికి తాము ఇల్లు కొనడం ఇష్టం లేదని తెలిపారు. అవకాశం కోసం చూస్తున్న వారు పిల్లలు అల్లరి చేస్తున్నారనే నెపంతో అనిల్, వెంకటేష్, లక్ష్మణ్, సరస్వతి, చంటి తమపై దౌర్జన్యానికి దిగి రాడ్లతో గాయపరచారని చెప్పారు. ఇంట్లో షోకేష్ అద్దం పగులగొట్టి సామగ్రిని పగులగొట్టి నానా హంగామా చేశారన్నారు. ఇక్కడి నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారని వాపోయారు. తన భార్య గర్భిణీ అని కూడా చూడకుండా తోసేశారని, ఆమెకు ఇనుప రాడు షోకేష్‌కు తగిలిందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భూకంప బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోడుమూరు

టర్కి, సిరియా దేశాలలో సర్వం కోల్పోయిన భూకంప బాదితులకు కోడుమూరు ఆవాజ్ కమిటి ఆధ్వర్యంలో జామియా, మహమ్మదీయ, మోమీన్, మక్కా, మదీన, అక్సా, మసీదులలో విరాళాలు సేకరించారు. మంగళవారం కోడుమూరు నుండి రూ. 25వేలు వసూలు అయింది. ఈ మొత్తం డబ్బును అవాజ్ కమిటి రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ.సుభాన్‌కు అందజేశారు. సుభాన్ మాట్లాడుతూ మానవతా దృక్పథంతోచ, టర్కి, సిరియా, దేశాల భూకంప బాధితులకు ఆర్థిక సహాయం అందించిన కోడుమూరు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు ముందుకు వచ్చిన టౌన్ , మండల ఆవాజ్ కమిటీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి మహమ్మద్, మండల ఉపాధ్యక్షులు ముస్తఫా, టౌన్ కన్వీనర్ ఖాజా, ఆవాజ్ నాయకులు పైల్వాన్ బాష, చనగండ్ల బడేసా, కె. రఫీక్, గఫూర్‌మియా, బషీర్ భాయ్, చాంద్ బాష, అజీజ్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ ప్రాంత ప్రజల జీవనాడి... వేదవతి

- నిధులు లేకుండా ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తి చేస్తారు..? - చెరువులను మింగేస్తున్న వైసిపి తిమింగలాలు - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-ఆలూరు

కరువు, కాటకాలతో సాగు, తాగునీరు లేక వలసలు వెళు_న్న జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలు శాశ్వత కరువు నుంచి బయట పడాలంటే వేదవతి రిజర్వాయర్ జీవనాడి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆధ్వర్యంలో హాలహర్వి మండలం అమృతపురం గ్రామ శివారులోని వేదవతి మొదటి లిఫ్ట్ స్థలాన్ని కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, ఓబులేసు, రామాంజనేయులు, హరనాథ్ రెడ్డి, జగదీష్, ఈశ్వరయ్య, జంగాల అజయ్ కుమార్ పరిశీలించారు. వేదవతి ప్రాజెక్టు ఎఇ రాజేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. రూ.1,942 కోట్ల నిధులు వేదవతి ప్రాజెక్టుకు అవసరమైతే ఇప్పటి వరకు కేవలం రూ.16 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు లేకుండా ఎలా పూర్తి చేయాలనుకున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతేడాది వేదవతి నుంచి 40 టిఎంసిల నీరు వృథాగా పోతోందని తెలిపారు. ఈ నీటితో 80 వేల ఎకరాలకు సాగు, 253 గ్రామాలకు తాగు నీరు అందించవచ్చని చెప్పారు. హాలహర్వి బెళగల్‌లో 2 టిఎంసిలు, మొలగవల్లిలో 1 టిఎంసి నీటి సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తామని మొదలు పెట్టిన ప్రభుత్వం ఇంతవరకు భూసేకరణ చేయకుండా, చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా పనులు ఆగిపోయాయని చెప్పారు. ఈనెల 13 నుంచి 23 వరకు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి షేకావత్‌ను కలిసి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామని తెలిపారు.

చెరువులను మింగేస్తున్న వైసిపి తిమింగళాలు

సమస్యలను వదిలేసి చెరువులను మింగేస్తున్న వైసిపి తిమింగళాలని కె.రామకృష్ణ విమర్శించారు. ఆలూరులో వైసిపి నాయకులు కబ్జాకు పాల్పడిన చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రాజెక్టులను నిర్మించి, చెరువులకు నీటిని నింపి ప్రజలను కాపాడాల్సిన అధికార వైసిపి నాయకులు మంత్రి భూ కబ్జాలకు పాల్పడటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పత్రికలు, జర్నలిస్టులను దుర్భాషలాడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో వార్తలు ప్రచురించడం, ప్రసారం చేయడం వల్లనే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. శేఖర్, లెనిన్, నబీ రసూల్, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు పాల్గొన్నారు.



కబ్జాకు గురైన చెరువును పరిశీలిస్తున్న రామకృష్ణ

1న జీతం పొందడం ఉద్యోగుల హక్కు

- బంగి శ్రీధర్

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1న జీతం చెల్లింపు జరిగేలా చట్టబద్ధత కల్పించాలని, అది ఉద్యోగుల హక్కు అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలోని ఎల్ఎల్‌సి కార్యాలయ ఆవరణలో ఆ సంఘం ఆదోని తాలూకా అధ్యక్షులు రషీద్ అధ్యక్షతన ఉద్యోగుల చర్చ వేదిక జరిగింది. సంఘం డిస్ట్రిక్ట్ అసోసియేట్ ప్రెసిడెంట్ సురేష్, కర్నూలు సిటీ వైస్ ప్రెసిడెంట్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నెలవారీగా కష్టపడి జీతం డబ్బులు కోసం ఉద్యోగులు ఎదురుచూడాల్సిన దుస్థితి ఉందన్నారు. రిటైర్మెంట్ ఆయన ఉద్యోగికి బెనిఫిట్స్ ఇవ్వకుండా కాలయాపన చేయడంతో చాలామంది నగదు పొందలేక తుది శ్వాస వదిలిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగుల జీతభత్యాలకు సరిపడే అమౌంట్ తీసి ఇతర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం తమను గుర్తించకపోవడం భావ్యం కాదన్నారు. టార్గెట్ల పేరుతో పనులు చేయించుకుంటూ, రెవెన్యూ వసూళ్ల మెరుగు పరచుకుంటూ, తమతో పని చేయించుకుంటున్న ప్రభుత్వం జీతం ఇవ్వడంలో మాత్రం కాలయాపన చేస్తోందన్నారు. తమ సమస్యల కోసమే సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ రావు నాయకుల బృందం గవర్నర్‌ను కలిశారే తప్ప ఎలాంటి దురుద్దేశమూ లేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఇప్పటికీ నాలుగు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు సుమారు రూ.14 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే అమౌంట్ పెరిగి ఉద్యోగులు పొందలేని పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. ఉద్యోగులకు 1న జీతం పొందే హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నా పాటించకుండా కక్ష సాధింపు ధోరణికి పాల్పడడం దారుణమని విమర్శించారు. హక్కుల సాధన కోసం ఉద్యోగులు ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు. సంఘం నాయకులు లక్ష్మి, వీరేష్, వేణు, నబీ రసూల్, రామకృష్ణ, కృష్ణ, దేవోజి, ఉద్యోగులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బంగి శ్రీధర్

పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌కు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ఎస్సీ కాలనీ, కటిక పేట, ఖబరస్తాను ఏరియా, చాకలిపేటలో దాదాపు 25 వేల మంది జనాభా ఉన్నారని, ఈ పేటల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంథోని, పట్టణ ప్రెసిడెంట్ ఎం.గుంటెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ప్రాంతంలో దాదాపు 90 శాతం మంది రోజువారీ కూలీలేనని, వీరు తరచుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆరోగ్య సమస్యలు వస్తే ఆర్ఎంపి, పిఎంపిలను సంప్రదించి వ్యాధులు నయం కాక డబ్బులు వృథా చేసుకుంటున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధించిన స్థలం ఉందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు మేల్కొని ఈ ప్రాంతంలో ప్రజల అనారోగ్య సమస్యలపై దృష్టి సారించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ వైస్ ప్రెసిడెంట్ సుమల రాజు, కార్యకర్తలు బాబు, బాలు పాల్గొన్నారు.

సంజీవయ్య జీవితం ఆదర్శవంతం

- ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరులో నివాళు లర్పిస్తున్న నాయకులు

దామోదర్ సంజీవయ్య జీవితం ఆదర్శవంతమని సంజీవయ్య వారసుడు రాధాకృష్ణ, మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రంగయ్య, సిపిఎం డివిజన్ నాయకులు హనుమంతు, శేఖర్, ప్రజాసంఘాల జిల్లా అధ్యక్షులు సాయిరాం, నరసప్ప, మధు తెలిపారు. మంగళవారం పట్టణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమక్షంలో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. ఎంతో మంది మహనీయులను, స్వాతంత్ర్య సమరయోధులను ఇచ్చిన పోరాటాల పురిటి గడ్డ రాయలసీమ నాటి కందనవోలు, నేటి కర్నూలుకు రుణపడి ఉన్నట్లు తెలిపారు. సొంతిల్లు కూడా లేని ముఖ్యమంత్రి ఈ ప్రపంచంలో ఎవరూ లేరని చెప్పారు. ఇంతటి మహనీయుని పేరు కర్నూలుకు పెట్టాలని సంతకాల సేకరణ, అసెంబ్లీలో ప్రస్తావించాలని గాజులదిన్నెలో మంత్రులను అడ్డుకున్నట్లు చెప్పారు. పోలీసులను పెట్టి తమపై కేసులు పెట్టడం సిగ్గుచేటని తెలిపారు. కర్నూలు జిల్లాకు సంజీవయ్య జిల్లాగా నామకరణం చేసి పెద్దపాడును సంజీవయ్య పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని కోరారు. **గోనెగండ్ల :** నీతి, నిజాయితీకి మారుపేరు మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య అని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్ తెలిపారు. గోనెగండ్లలో డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్షులు మారేష్ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి

- ఆర్‌టిఒ శిశిర దీప్తి

ప్రజాశక్తి - ఆదోని

బాలికలు చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆర్‌టిఒ అధికారిణి శిశిర దీప్తి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎస్‌జిఎఫ్ 14 విభాగం బాలికల కబడ్డీ శిక్షణ శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాను కూడా స్వతహాగా అథ్లెట్‌నని, జాతీయ స్థాయిలో పార్టిసిపేట్ చేశానని తెలిపారు. మహిళలు క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకెళితే లక్ష్యాలు సాధ్యమని చెప్పారు. శిక్షణలో మెళకువలు నేర్చుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నరసయ్య, ఈరన్న, ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కంబిరెడ్డి, ఎపి పిఇటిస్, ఎస్ఎ పిఇ ఆదోని జోన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, నరసింహ రాజు, కోశాధికారి ఆనంద్, కబడ్డీ శిక్షకులు రామన్న, హరిత, పెద్ద మహబూబ్ బాష, హరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు సాబీర్ అహ్మద్, గంగాధర్ పాల్గొన్నారు.



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న శిశిర దీప్తి